సాక్షి
ఏలూరు
బుధవారం । 17 । మే । 2023



ధాన్యం కుప్పలు బుగ్గిపాలు
పోలవరం మండలం కొత్తపట్టిసీమలో అగ్నిప్రమాదంలో రూ.25 లక్షల విలువైన వరికుప్పలు బూడిదయ్యాయి. 3 కిలోమీటర్ల మేర మంటలు వ్యాపించాయి. 8లో



విశాఖకు ప్రత్యేక బస్సులు
వేసవి సందర్భంగా విశాఖపట్నం విహార యాత్రకు పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. 8లో



వైభవంగా వెంకన్న గ్రామోత్సవం
స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నిత్యహోమం, నీరాజనం తదితర పూజలు చేశారు. 8లో

మామిడి ముంచేసింది!

- వాతావరణ మార్పులతో భారీగా తగ్గిన దిగుబడి
- నాణ్యత లేక గిట్టుబాటు ధర కరవు
- అయోమయంలో మామిడి రైతులు



నూజివీడు మండలం దిగవల్లిలో వడదెబ్బకు రాలిన మామిడి కాయలు



ఏలూరు(మెట్రో): ఈ ఏడాది మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలతో మామిడి పంట దిగుబడి బాగా పడిపోయింది. వచ్చిన పంట కూడా నాణ్యంగా లేకపోవడంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దీంతో ఈ ఏడాది బాగా నష్టపోయామని రైతు ఆవేదన చెందుతున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడి రైతు ఈ ఏడాది నష్టపోయాడు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతయ్యే మామిడికి ప్రస్తుతం సొంత రాష్ట్రంలోనూ సరైన ధర దక్కని పరిస్థితి. అసలే కాపు తక్కువగా రావడం, మూడు దఫాలుగా వచ్చిన గాలి దుమ్ములు, అకాల వర్షాలకు, ఎండ వేడిమికి పూత పిందె, కాయ ఇలా అన్ని దశల్లోనూ రాలిపోయింది. అక్కడక్కడా కొన్ని కాయలు ఉన్నా, ఆ కాయలకు మంగు మచ్చ ఆశించడంతో కనీసం ఎకరాకు రూ.30 వేలు కూడా దక్కని పరిస్థితి.

కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి

జిల్లాలో బంగినపల్లి, రసాలు అధికంగా ఉత్పత్తి అయ్యేవి. రైతుకు ఈ రకాలే అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టేవి. ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, ఏప్రిల్ నెలలో విపరీతమైన ఎండల వల్ల పంట దెబ్బతింది. దీంతో కనీసం కూలీ ఖర్చులు కూడా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలకు, అధిక ఉష్ణోగ్రతలకు మామిడి నాణ్యత లేకుండా రైతును ముంచేసింది.

ఇతర రాష్ట్రాలకు తగ్గిన ఎగుమతులు

కాయపై మచ్చ ఏర్పడటంతో మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎగుమతి కావాల్సిన మామిడి స్థానికంగానే ఉండిపోతోంది. గతంలో నూజివీడు రసాలు అంటే ఇతర రాష్ట్రాలకు ఎంతో ప్రసిద్ధి. అలాంటి నూజివీడు ప్రాంతంలో రైతులు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు. ఆగిరిపల్లి, నూజివీడు, చాట్రాయి, ముసునూరు, చింతలపూడి మండలాల్లో 14 వేల హెక్టార్లలో మామిడి విస్తరించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రైతులంతా నష్టపోయారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి మాట పక్కన పెడితే స్థానికంగా ఉన్న నున్న మార్కెట్‌లోనూ రైతు ఆశించిన ధర లభించడం లేదు.

మొగల్తూరులోనూ అదే పరిస్థితి

గతంలో మంచి రంగు, మచ్చలేని మామిడి కాయలను టన్ను రూ.40 వేలకు విక్రయించే వారు. ప్రస్తుతం స్థానిక నున్న మార్కెట్‌లో మచ్చలున్నవి కనీసం రూ.10 వేలకు కూడా కొనడం లేదు. గతంలో 20 వేల టన్నుల దిగుబడి ఉన్న మామిడి ఈ ఏడాది 3 నుంచి 5 టన్నుల కూడా ఉత్పత్తి రాలేదు. **వచ్చిన కాయ సైతం మంగు, మచ్చలతో ఉండటంతో కనీసం కొనే నాథుడే కరవువయ్యాడు. ఇదిలా ఉండగా, ఆలస్యంగా వచ్చే నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 2 వేల హెక్టార్లలో విస్తరిం**చి ఉన్న మామిడి కాపు ప్రస్తుతం ఆశాజనకంగా లేదని రైతులు చెబుతున్నారు. మామిడికి ప్రసిద్ధి చెందిన ఉమ్మడి జిల్లాలో రైతు ఢీలా పడ్డాడు. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో పూర్తిగా రైతులు మామిడి పంటను తొలగించేశారు. గతంలో బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం మండలాల్లో మామిడి పంట ఉన్నప్పటికీ గత రెండు సంవత్సరాలుగా ఉన్న అరకొర చెట్లను సైతం పెకిలించేశారు. రానున్న రోజుల్లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులే కొనసాగితే జిల్లాలో మామిడి పంట అంతరించి పోయే పరిస్థితి ఏర్పడనుంది.

కొనేందుకు ముందుకు రావడం లేదు



గతంలో ఎకరాకు రూ.40 వేలు కౌలు వచ్చేది. అకాల వర్షాలతో వాతావరణ మార్పులతో ప్రస్తుతం పేను బంక, మంగు మచ్చలు రావడంతో మామిడి కాయ పూర్తి నాణ్యత కోల్పోయింది. ఆశించిన ధర లేదు సరికదా, స్థానికంగా కూడా కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు.
– శీలపురెడ్డి నాగిరెడ్డి, మామిడి రైతు

మత్తు పదార్థాలతో యువత చిత్తు



నూజివీడులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతోన్న నవజీవన్ బాలభవన్ ప్రతినిధి శేఖర్‌బాబు

నూజివీడు: మత్తు పదార్థాల వల్ల యువత తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం మాదకద్రవ్యాల వల్ల నష్టాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా అలవాటు చేసుకొని ఆ తరువాత దానికి బానిసలుగా మారతారన్నారు. ఈ విధంగా బానిసలుగా మారిన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి, కౌన్సెలింగ్ చేసి దాని నుంచి బయటపడేలా చేయవచ్చన్నారు. మాదకద్రవ్యాల బారిన యువత పడకుండా చేసే కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు ప్రధాన భూమిక వహించాలన్నారు. సోషల్ మీడియా నేడు మంచి కంటే కీడు ఎక్కువగా చేస్తోందన్నారు. దీనికి అలవాటు పడిన వారు ఒంటరితనానికి అలవాటవ్వడమే కాకుండా డిప్రెషన్‌కు లోనవుతున్నారన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో నూరాణి మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడం, మనసు విప్పి మాట్లాడటం వంటివి చేయడం ద్వారా మత్తు పదార్థాల నుంచి బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టు జీ అనూష, ఏసీడీపీవో నాగేశ్వరి, జోనల్ కోఆర్డినేటర్ బీ రవి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బార్‌లో ఉద్యోగిపై దాడి



దాడిలో గాయపడిన లక్ష్మణరావు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని కొట్టి గాయపర్చిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బానాల లక్ష్మణరావు లక్ష్మణరావు, వంశీకృష్ణ, షేక్ ఖాసిం, మరికొందరితో కలిసి స్థానిక బార్‌లో మద్యం సేవించాడు. ఈ క్రమంలో బిల్లు చెల్లించే విషయంలో గొడవ తలెత్తడంతో షేక్ ఖాసిం, మరికొంతమంది కలిసి బీరుసీసాతో లక్ష్మణరావు తలపై కొట్టారు. లక్ష్మణరావుకు తీవ్ర గాయమైంది. అతని వెంట వచ్చిన వంశీకృష్ణను సైతం కొట్టారు. విషయం తెలుసుకున్న సీఐ బాలసురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని యువకులను చెదరగొట్టడంతో పాటు గాయపడ్డ లక్ష్మణరావు, వంశీకృష్ణలను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న డీఐజీ



మావుళ్లమ్మ సన్నిధిలో డీఐజీ అశోక్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదం అందచేశారు. పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామిని కూడా డీఐజీ అశోక్ కుమార్ దర్శించుకున్నారు.

పోలీసు అధికారులతో డీఐజీ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్, చిత్రంలో ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మంగళవారం భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా ఎస్పీ రవిప్రకాష్ డీఐజీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీసుస్టేషన్ల వారీగా నమోదైన కేసులు, పరిష్కారం కాని కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నారిపై బాలుడి అత్యాచార యత్నం

కాళ్ల: ఆకివీడు మండలం రాజుల పేట పంచాయతీ కొత్తచెరువు గ్రామంలో ఐదేళ్ల చిన్నారిపై 17 ఏళ్ల బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు ఆకివీడు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలికను అన్నయ్య వరసైన బాలుడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో నాన్నమ్మ ఇంటికి వెళ్దామని తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించిగా బాలిక ఏడవటంతో తీసుకొచ్చి ఇంటి వద్ద వదిలేశాడు. చిన్నారిని తల్లి ఎక్కడికి వెళ్లావు అని ప్రశ్నించగా.. జరిగిన విషయం తల్లికి చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సంజీవరావు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ త్రినాథ్, ఎస్సై రాజారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు.

మత్స్య సంపద యోజనపై సమీక్ష



మత్స్య శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో మంజూరైన యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం మత్స్య శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అనుకూల పరిస్థితులున్నాయని, వాటి ద్వారా ఆయా ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ యూనిట్లకు దరఖాస్తులు చేసుకున్నారని, వాటికి బ్యాంకుల నుంచి త్వరితగతిన రుణ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుని యూనిట్ల స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. 2020–21 నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు 426 మందికి వివిధ పథకాలు మంజూరు చేశామని.. వాటిలో ఇంకా 236 యూనిట్ల గ్రౌండింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో పెద్దఎత్తున నిర్మిస్తున్న జగనన్న లేఅవుట్ల వద్ద మినీ ఫిష్ కియోస్క్‌లు ఏర్పాటు చేసేందుకు అనువైన పరిస్థితులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా ఫీడ్ యూనిట్ల నిమిత్తం దరఖాస్తులు పరిశీలించి వాటి ఏర్పాటుకు అవసరమైన అనుమతులు పరిశీలించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఏ.చంద్ర శేఖర్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం వెంకటేశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ దేవర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- ఉమ్మడి జిల్లాలో కొనసాగిన సూర్యుడి భగభగలు
- ఆగిరిపల్లి, పోలవరంలో అత్యధిక ఉష్ణోగ్రత
- నేడు కాస్త తగ్గవచ్చంటున్న వాతావరణ శాఖ



ఏలూరు(మెట్రో): భానుడి భగభగలతో ఉమ్మడి జిల్లాలో జనం అల్లాడుతున్నారు. గత రెండు రోజులుగా ఎండ ప్రచండంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వేడిగాలులకు ఇళ్లల్లో సైతం జనం ఉండలేని పరిస్థితి. ఉదయం నుంచే భానుడి భగభగలతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 8 గంటలకు మొదలైన ఎండ వేడిమి సాయంత్రం 6.30 వరకు కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు మంగళవారం సైతం కొనసాగాయి. ప్రతీ మండలంలోనూ 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో అత్యధికంగా 46 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, పోలవరంలో 45.8 డిగ్రీలు, ద్వారకాతిరుమలలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు మండలంలో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం ప్రతి మండలంలోను ఉష్ణోగ్రతలు ప్రజల్ని అల్లాడించాయి. బుధవారం ఉష్ణోగ్రతలు కొంత తగ్గవచ్చని.. 38 నుంచి 42 డిగ్రీల మధ్యలో నమోదు కావచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ రెండు మూడు రోజులు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

ఏలూరు జిల్లా ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

మండలం	మంగళవారం	బుధవారం అంచనా
ఆగిరిపల్లి	46.0	42.0
భీమడోలు	45.0	38.9
బుట్టాయగూడెం	42.8	39.5
చాట్రాయి	43.1	40.9
చింతలపూడి	42.4	40.6
దెందులూరు	44.0	39.5
ద్వారకాతిరుమల	45.7	39.4
ఏలూరు	43.7	39.3
గణపవరం	44.3	38.5
జంగారెడ్డిగూడెం	44.3	39.8
జీలుగుమిల్లి	41.8	40.1
కైకలూరు	44.0	38.0
కలిదిండి	42.7	36.4
కామవరపుకోట	44.4	39.8
కొయ్యలగూడెం	43.5	39.6
కుకునూరు	42.3	42.3
లింగపాలెం	44.0	40.4
మండవల్లి	42.3	39.0
ముదినేపల్లి	43.1	37.9
ముసునూరు	44.0	40.9
నిడమర్రు	42.2	38.3
నూజివీడు	43.2	41.4
పెదపాడు	45.5	40.3
పెదవేగి	44.0	40.2
పోలవరం	45.8	39.6
టి.నరసాపురం	45.2	40.1
ఉంగుటూరు	43.5	38.8
వేలేరుపాడు	43.5	40.7

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఇంటర్మీడియేట్ మొదటి, రెండో సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ మే 24 నుంచి జూన్ 1 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 11,223 మంది హాజరుకానున్నారని, పరీక్షల నిమిత్తం ఏలూరు జిల్లాలో 32 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 2న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష, జూన్ 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష, జూన్ 5 నుంచి జూన్ 9 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు, ఫొటో స్కానింగ్ కేంద్రాలను పరీక్షా సమయాలలో మూసివేయాలని అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. వేసవి దృష్టిలో ఉంచుకొని తాగునీరు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

మసీదుల అభివృద్ధికి ప్రణాళిక

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ డాక్టర్ కామిలు జమా



జిల్లా వక్ఫ్ బోర్డ్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ ఎండీ జమా

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ సోదరుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, వక్ఫ్ బోర్డును పునరుద్ధరించి రాష్ట్ర వ్యాప్తంగా మసీదుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎండీ కామిలు జమా అన్నారు. ఏలూరు నగరంలోని హోటల్ ఆదిత్య గ్రాండ్‌లో మంగళవారం జిల్లా వక్ఫ్ బోర్డు సమావేశం నిర్వహించారు. జిల్లాలో మసీదుల అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఏ ప్రాంతాల్లో మసీదులను అభివృద్ధి చేయాలి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో డైరెక్టర్లు, సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ జమా మాట్లాడుతూ.. ఏలూరు జిల్లాలో ప్రతి మసీదు వక్ఫ్ బోర్డులో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే ప్రతీ సంక్షేమ కార్యక్రమాన్ని, అభివృద్ధి పనులను అందుకునేలా మసీదులు నమోదు కావాలన్నారు. ముఖ్యంగా నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామంలోని చిన్న మసీదు, గణపవరం మసీదు, లక్కవరం మసీదులో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించామని తెలిపారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారం చేపట్టేలా ముస్లిం మైనార్టీ సోదరులంతా అండగా ఉండాలని కోరారు. ముస్లిం మైనార్టీల పట్ల సీఎం జగనన్నకు ఉన్న ప్రేమ, ఆప్యాయతలకు అనుగుణంగా ప్రతీ ముస్లిం సోదరుడు రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు సయ్యద్ సలీం పాషా ఖాద్రి, కార్యదర్శి షేక్ రహ్మతుల్లా, షేక్ మహమ్మద్ జహీర్, అబ్దుల్ రవూఫ్, షేక్ సుభానీ, షేక్ సర్దార్, షేక్ జమాల్ షరీఫ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ పాషా ఖాద్రి, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

లాంగ్వేజ్ పండిట్ పరీక్షల్లో 786 మంది ఉత్తీర్ణత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత జనవరిలో 2019–20, 2020–21 బ్యాచ్‌లకు సంబంధించి నిర్వహించిన లాంగ్వేజ్ పండిట్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 811 మంది హాజరు కాగా 786 మంది 96.90 శాతంతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అభ్యర్థులు, కళాశాలల సమాచారం కోసం డమ్మీ మార్కుల మెమోరాండం బీఎస్‌ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయానికి నేరుగా ఫీజు చలానాతో పాటు సమర్పించాలని సూచించారు. మార్కుల రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 ఏపీ సీఎఫ్ఎంఎస్ విధానం ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను టీవీఆర్ ప్రభావతి, అదనపు జాయింట్ సెక్రటరీ ఆఫీస్ ఆఫ్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, ఆంధ్రా హాస్పిటల్ ఎదురుగా, గొల్లపూడి, విజయవాడ –521225 చిరునామాకు పంపాలని సూచించారు.

ఈఏపీ సెట్‌కు 2,905 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష రెండో రోజు మంగళవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 10 కేంద్రాల్లో మొత్తం 2,905 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్‌లో జరిగిన పరీక్షల్లో ఉదయం 180 మందికి 175 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 180 మందికి 173 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 131 మందికి 129 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 130 మందికి 128 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 150 మందికి 147 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 150 మందికి 142 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 1,042 మందికి 1,004 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1,040 మందికి 1007 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



కైకలూరు: వడదెబ్బకు గురై వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు జానకినగర్‌కు చెందిన గాజుల బుచ్చిరామకృష్ణ(72) మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 12 ఆకివీడు నుంచి కైకలూరు మండలం ఆలపాడుకు నడుచుకుంటూ వచ్చాడు. సమీపంలో పడిపోవడంతో కొందరు చూసి కుటుంబ సభ్యులకు చెప్పడంతో అతనిని ఇంటికి తీసుకువెళ్లారు. మరుసటి రోజు మళ్ళీ నడుచుకుంటూ ఆలపాడు వచ్చి సమీపంలో ఎండదెబ్బకు పడిపోయాడు. రూరల్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుపై రూరల్ పోలీసలు కేసు నమోదు చేశారు.

ధాన్యం కుప్పలు బుగ్గిపాలు



కొత్తపట్టిసీమ గ్రామంలో పొలాల్లో చెలరేగుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

- కొత్తపట్టిసీమలో భారీ అగ్నిప్రమాదం
- 3 కి.మీ మేర ఎగిసిపడ్డ మంటలు
- 45 ఎకరాల్లో 24 ధాన్యం కుప్పలు దగ్ధం
- రూ.25 లక్షల నష్టం.. తల్లడిల్లిన రైతులు



కాలిన వరికుప్పలను పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: కొత్తపట్టిసీమ గ్రామంలో మంగళవారం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు రూ.25 లక్షల విలువైన వరికుప్పలు కాలి బూడిదయ్యాయి. రైతులు ఇటీవల వరిచేలు కోసి కుప్పలు వేశారు. కొందరు రైతులు మొక్కజొన్న పంట వేసి సేద్యం పూర్తికావడంతో పంట చేతికి వచ్చింది. ఖాళీగా ఉన్న మొక్కజొన్న చేలల్లో తుక్కును తగులబెట్టి ఉండవచ్చని, లేదా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు పడి మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు.

3 కిలోమీటర్ల పొడవున ఎగసిన మంటలు

మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు గంటల వ్యవధిలోనే సుమారు మూడు కిలోమీటర్ల పొడవున వ్యాపించాయి. భారీస్థాయిలో ఎగసిపడిన మంటలతో పొలాల్లో వేసిన వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. అప్పటివరకు పొలాల్లోనే ఉన్న రైతులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రమాదం జరగడానికి ముందు ఇళ్లకు చేరుకున్నారు. ఆ సమయంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న రైతులు ఉరుకులు పరుగులతో పొలాల్లోకి చేరుకోగా, అప్పటికే మంటలు చెలరేగి ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలి బూడిదవుతుంటే తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కౌలుకు భూములు తీసుకుని వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట పండించామని వాపోతున్నారు. ఈ ఏడాది ఎకరానికి 40 బస్తాలకు పైగా పండిందని, దిగుబడి కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు. తీరా కళ్లముందే కాలి బూడి కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోయారు. పొలాల మధ్యలోని రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల పొడవునా పెద్ద పెద్ద మంటలు ఎగిసిపడ్డాయి. ఎండిపోయి ఉన్న మొక్కజొన్న, వరి చేలు కావడంతో గంటల సమయంలో పూర్తిగా పొలాలు దగ్ధమయ్యాయి. సుమారు 45 ఎకరాల్లోని 24 వరికుప్పలు పూర్తిగా దగ్ధమైనట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సుమారు 126 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, సుమారు రూ.25 లక్షల వరకు పంట నష్టం ఏర్పడి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పొలాల్లో ఉన్న మోటార్లు, ఇంజిన్లు, సోలార్ లైట్లు కాలి బూడిదయ్యాయి.

రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపు

ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రాజమండ్రి, నిడదవోలు నుంచి రెండు ఫైర్ ఇంజిన్లలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఆయా ప్రాంతాలను నీటితో తడిపి అదుపుచేశారు.

పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి, డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఏడీఏ పీజీ బుచ్చిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. నష్టంపై ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రమాదం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వీరి వెంట సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, డీటీ కె.రమేష్ ఉన్నారు.

విశాఖ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ప్రజా రవాణా అధికారి ఎం.వీరయ్య చౌదరి

భీమవరం(ప్రకాశం చౌక్): విశాఖ విహార యాత్రకు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వీరయ్య చౌదరి మంగళవారం చెప్పారు. వేసవి సెలవుల సందర్భంగా విశాఖపట్టణంలోని సుప్రసిద్ధ ప్రదేశాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ యాత్రలో సింహచలం, కైలాసగిరి, ఉడా పార్క్, నేవీ మ్యూజియం, ఆర్కే బీచ్, కాళీ టెంపుల్, జూపార్క్ తదితర వాటిని తిలకించేలా టూర్ ప్లాన్ చేశామన్నారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి శనివారం రాత్రి ప్రత్యేక బస్సులు బయలుదేరి ఆదివారం విహారయాత్ర చూసుకుని సోమవారం ఉదయం నాటికి తిరిగి డిపోలకు చేరుకుంటాయన్నారు. రిజర్వేషన్ అందుబాటులో ఉందన్నారు. భీమవరం డిపో నుంచి సూపర్‌ల గ్జరీ వీడియో కోచ్ చార్జీ రూ.1,150, నర్సాపురం డిపో నుంచి రూ.1,110, తాడేపల్లిగూడెం డిపో నుంచి రూ.1,100, తణుకు డిపో నుంచి రూ.1040 కాగా, నర్సాపురం డిపో నుంచి ఇంద్ర చార్జిగా రూ.1,380, తణుకు డిపో నుంచి రూ.1,290, తాడేపల్లిగూడెం డిపో నుంచి రూ.1,330గా ఉంటుందని తెలిపారు. అలాగే గత మూడు నెలలుగా అరుణచలం యాత్రకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ బస్సులకు విశేష స్పందన లభించిందన్నారు. దీంతో భక్తుల కోరిక మేరకు మరిన్ని సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు ఆర్టీసీ కల్పిస్తున్న ప్రత్యేక బస్సులను ఉపయోగించుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా ఏసీ బస్సుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వీరయ్య చౌదరి తెలిపారు.

క్లుప్తంగా

కలప దుంగలు స్వాధీనం



కన్నాపురం అటవీశాఖ కార్యాలయంలో అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

కొయ్యలగూడెం: అక్రమంగా కారులో రవాణా చేస్తున్న కలపను మంగళవారం తెల్లవారుజామున సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం ఫారెస్ట్ రేంజర్ కె.కృష్ణకుమారి చెప్పారు. బందారు కలప జాతికి చెందిన పదకొండు దుంగలను తరలిస్తుండగా దొండపూడి ప్రాంతంలో పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.50 వేలకు పైగానే ఉంటుందని ఆమె తెలిపారు. కలప రవాణా చేస్తున్న కారుతో సహా దుంగలను కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.కన్నయ్య, ఎఫ్‌బీవోలు ఈ.సుధాకర్, నవ తేజ, శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలం లేకున్నా పాసు పుస్తకం జారీపై విచారణ

దెందులూరు: పొలం లేకున్నా నాలుగు ఎకరాలు కలిగి ఉన్నట్లు పోతునూరుకు చెందిన ఓ మహిళ పేరున పట్టాదారు పాసుపుస్తకం, డి ఫారం పట్టా జారీ చేసిన వ్యవహారంపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో తహసీల్దార్ నాంచారయ్య విచారణ చేశారు. గతంలో పోతునూరులో గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేసిన డి.నాగరాజు, పీవీ సూర్యచంద్రరావు, ప్రస్తుత వీఆర్వో బోదుల శ్రీనివాసరావులను తహసీల్దార్ విచారణ చేసి పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన ఆడారి కనక వరవిజయలక్ష్మికి భూమి లేకపోయినా నాలుగు ఎకరాలు ఆమె పేరున డి.ఫారం పట్టా, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారు. ఈ వ్యవహారంపై గ్రామానికి చెందిన వేగి వీరబాపూజీ, బొడ్డేటి కోటేశ్వరరావు ముఖ్యమంత్రి, కలెక్టర్, ఆర్డీఓలకు ఈ ఏడాది మార్చి 27న ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ నాంచారయ్య విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా, పోతునూరు గ్రామ రికార్డుల్లో ఆడారి కనక వర విజయలక్ష్మికి నాలుగు ఎకరాల భూమి లేదని, ఈ ఏడాది ఏప్రిల్ 20న ఏలూరు ఆర్డీఓ పెంచల కిషోర్ లిఖితపూర్వకంగా ధ్రువీకరించారు.

హజ్ యాత్రకు ఆర్థిక సాయంపై హర్షం

- 1,813 మంది యాత్రికులకు రూ.14.51 కోట్లు చెల్లించిన జగన్ సర్కారు
- వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ రాజా అహ్మద్



రాజా అహ్మద్, వైఎస్ఆర్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముస్లింల పవిత్ర పుణ్య క్షేత్రం మక్కాకు హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి వెళ్లే ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14.51 కోట్లు మంజూరు చేయడం సాహసోపేత నిర్ణయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ రాజా అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బెంగళూరు ఇమ్మిగ్రేషన్ పాయింట్ల నుంచి కంటే విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు చార్జి రూ.80 వేలు ఎక్కువగా ఉందన్నారు. కాగా గన్నవరం ఇమ్మిగ్రేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు 1,813 మంది యాత్రికులు సిద్ధమయ్యారని, వీరికి రూ.80 వేలు అదనపు భారంగా పరిణమించడంతో మినహాయింపు కావాలని యాత్రికులు కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ మంత్రిని చార్జి మినహాయింపు కోసం కోరగా దానికి ఆయన నిరాకరించారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన స్పందించి తాను ఉన్నానని భరోసానిస్తూ హజ్ యాత్రకు అయ్యే అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని హజ్ యాత్రికులకు హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వానికి భారమైనా మైనార్టీ వెల్ఫేర్ శాఖ ద్వారా గత సోమవారం రూ.14.51 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడం అభినందనీయమన్నారు. హజ్ యాత్రికులపై పడిన అదనపు భారాన్ని దేశంలో కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే భరిస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముస్లిం పక్షపాతి అని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గడపగడపకు సంక్షేమం



జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ సమస్య వింటున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



ఉంగుటూరు: చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

కౌలు రైతు మృతదేహంతో ఆందోళన

డీఎస్పీ శ్రీనివాసరావు హామీతో ఆందోళన విరమణ

ఉంగుటూరు: కౌలు రైతు పొత్తూరి సూర్యనారాయణరాజు ఆత్మహత్య ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం మృతదేహంతో వెంకటకృష్ణాపురంలో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. కైకరానికి చెందిన వెజ్జు వెంకన్న పొలాన్ని సాయంపాలెంకు చెందిన యర్రా పొత్తూరి సూర్యనారాయణరాజు, అతని తండ్రి నాగరాజు కలిసి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. పంట చేతికి అందడంతో పెట్టుబడి పెట్టిన కర్రి ముత్యాలరావుకు మూడేళ్ల నుంచి బాకీ ఉండటంతో రైతు అనుమతితో ధాన్యం తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో వెజ్జు వెంకన్న కుమారుడు ప్రసాద్, రైతుకు మధ్య కౌలు విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో సూర్యనారాయణరాజు, తండ్రి నాగరాజు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, సూర్యనారాయణరాజు మృతి చెందాడు. ఏలూరులో చికిత్స పొందుతున్న తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కర్రి ముత్యాలు, అతని తండ్రి శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెజ్జు వెంకన్న వల్లే సూర్యనారాయణరాజు మృతి చెందాడంటూ మంగళవారం అతని కుటుంబ సభ్యులు, బంధువులు కైకరం బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని వెంకటకృష్ణాపురం వద్ద అడ్డుకున్నారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీనివాసరావు ఆందోళనకారులతో చర్చించి పోలీసులకు సహకరించారు

నగరం.. నిప్పుల కొలిమి

ఏలూరు నగరం మంగళవారం నిప్పుల కొలిమిని తలపించింది. నగరంలో అత్యధికంగా 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. తీవ్ర ఎండ వేడిమితో ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితయ్యారు. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు - సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



బిడ్డకు ఎండ తగలకుండా..



గొడుగు రక్షణలో..



నిర్మానుష్యంగా మారిన కార్పొరేషన్ కార్యాలయం రోడ్డు



బైక్‌పై వెళుతూ.. జాగ్రత్తలు పాటిస్తూ..

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: యువతిని మోసం చేసిన నేరంపై యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన కథనం ప్రకారం .. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం గ్రామానికి చెందిన ఓ యువతికి జంగారెడ్డిగూడెంలో ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో తాడువాయి గ్రామానికి చెందిన టి.పవన్ కల్యాణ్‌తో పరిచయమైంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా పవన్‌కల్యాణ్ నిరాకరించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. గతంలో వీరి పెళ్లికి పవన్‌కల్యాణ్ తండ్రి అంగీకరించాడు. దీంతో అతనిని కలిసి పెళ్లి చేయాలని కోరగా అతను కూడా బెదిరించాడు. దీంతో బాధితురాలు పవన్‌కల్యాణ్, అతని తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా పారిజాతగిరి వెంకన్న గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నిత్యహోమం, నీరాజనం, తీర్థప్రసాదగోష్టి తదితర పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఉభయదారులుగా బుద్దాల నాగదుర్గారావు, కృష్ణవేణి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన దాతలను శేషవస్త్రాలు, ప్రసాదాలు, వేద పండితులు శ్రీసత్య పవన్ ఆశీస్సులతో సన్మానించారు. ములగలంపల్లి గ్రామానికి చెందిన శ్రీవెంకటేశ్వరస్వామి భజన మండలి సభ్యులు ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి గరుడ వాహన సేవ ద్వారా గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి, పురవీధుల్లో సన్నాయి, కేరళ డ్రమ్స్, మేళతాళాలు నడుమ ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి భక్తులు నీళ్లబిందెలతో స్వాగతం పలికి, హారతి ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో మానికల రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు కంది బాలకృష్ణారెడ్డి, దండు ధనరాజు, రెడ్డి రంగ ప్రసాద్, వాసవి శాయి నగేష్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

వీరవాసరం: మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. రాయకుదురుకు చెందిన కోండ్రు సత్యనారాయణ, పెద్దిరెడ్డి వెంకట సత్యనారాయణ, బెల్లంకొండ వెంకట్రావు అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

20న గురుకుల ప్రవేశ పరీక్షలు

టి.నరసాపురం: జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 20న ఏలూరులో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్ టీఎస్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి గాను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కళాశాలలో ప్రవేశానికి గాను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను 'ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్' వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లో పేర్కొన్న విధంగా వారికి కేటాయించిన పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని కోరారు.